# ఎదురు చూసిన ముహూర్తం

అందమైన వస్తువుల్ని చూడటంలో ప్రతివ్యక్తి ఆహ్లాదాన్నీ, అనుభూతినీ పొందడం కద్దు. భగవంతుడు ప్రసాదించిన దృష్టికి సార్థకత ఏర్పడిందన్న సంతృప్తికూడా లభించగలదు. తాజ్ మహల్‌ను చూడడానికి తహతహలాడే కళ్లు పాడుబడ్డ పెంకుటింటికేసి దృష్టిని మళ్ళించవు; సెలయేటి సౌందర్యానికి అలవాటు పడ్డ చూపు మురికి కాల్వలపైకి పోదు; తెలివెన్నెల మల్లెపువ్వులపై వాలిన నేత్రాలు రోడ్డుప్రక్కన దుమ్ము కొట్టుకున్న పిచ్చి మొక్కల పువ్వులపై వాలవు. అట్లాగే ప్రొద్దున్నే పూచిన తెల్లగులాబీలా వున్న స్త్రీ మీద ప్రసరింపబడే దృక్కులు మధ్యాహ్నపు ఎండ తీవ్రతకు మాడి మసిబొగ్గులా తయారైన నీలి పువ్వులాంటి స్త్రీపై ప్రసరింపబడవు. ఇది కొత్తగా కనిపెట్టబడ్డ సత్యం కాదు. తనకు ఊహ తెల్సిన దగ్గర్నుంచి సునందకు ఆ సత్యం పచ్చి వెలక్కాయ పచ్చిపచ్చిగా గొంతులో ఇరుక్కున్నంత బాధగా తెలియవస్తూనే ఉంది.

మరి పాడుబడ్డ పెంకుటిల్లూ, మురికికాలువా, పిచ్చిమొక్క పువ్వూ, నీలిపువ్వులాంటి స్త్రీ - వీటినిగురించి లోకం యేమీ పట్టించుకోదా ? అనుకుంటుంది సునంద అప్పుడప్పుడూ.

నారాయణగూడా గాంధీబొమ్మ దగ్గర ఆ సాయంత్రం అయిదున్నర గంటలకు సిటీబస్సు దిగింది సునంద. గత పదిసంవత్సరాలుగా ఆమె ఉదయం తొమ్మిది గంటలకు అక్కడే సిటీబస్సు

ఎక్కి ఆఫీసుకు వెళుతూన్నది; సాయంత్రం అయిదున్నర గంట లకు అక్కడే ఆఫీసునుంచి వస్తూ సిటీబస్సు దిగుతున్నది. ఆ బస్సు స్టాప్‌నుంచి ఓ ఫర్లాంగుదూరం నడిస్తేగానీ ఆమె యిల్లు చేరుకోదు.

సాయంత్రంపూట ఆ సెంటరంతా కొత్తదుస్తులు ధరించినంత సందడిసందడిగా ఉంటుంది. వచ్చేపోయే జనమూ, తిరిగేకార్లూ, రిక్షాలూ, సైకిళ్ళూ-అంతా కులాసాయైన వాతావరణం.

సిటీబస్సు దిగిన సునంద దగ్గర్లో వున్న టాయ్ ఎంపోరియం లోకి వెళ్ళింది. ఓ బొమ్మ కొన్నది. అందమైన పాపాయిది. ఇరవై యెనిమిదేళ్ళ వయస్సులో యింకా పెళ్ళిగాని పడుచు దనంలో ఆ బొమ్మపై ఆమెకు మనసు పోవడంలో అబ్బుర మేమీ లేదు. ఈ పాటికి పెళ్ళిచేసుకొనివుంటే-తను ఇట్లాంటి అంద మైన పాపాయిల్ని ఎంతమందిని కనివుండేదో! అని ఆమె చాలా మార్లు అనుకోవడంలోకూడా అట్టే విశేషం లేదు.

కాని, అసలు జీవితంలో తనకు పెళ్ళి అవుతుందా? ఆ యోగం తన బ్రతుక్కి రాసిపెట్టి ఉందా?-ఆ భావన మనసులో మెదిలినప్పుడల్లా సునంద ఎండకు తోటకూర కాడవలె మెలిదిరిగి పోతూ ఉంటుంది.

స్త్రీకి సహజంగా ఉండాల్సిన అందచందాల్లో అయిదో అంశ కూడా ఆమెకు లేకపోవడం బ్రహ్మదేవుని అన్యాయమే! ఆమె మేనిరంగు ముదిరిన చీకటిలాంటిది. ఆ చీకట్లో తారట్లాడే మిణుగురు పురుగుల్లాంటివి ఆమె నేత్రాలు. చిత్తూరు మామిడి పండు ఆకారంలో వున్న ఆమె మొహంలో ఆకర్షణా, అందమూ ఏకోశానా లేవు. ఆమె జడ ఎలుక తోకనూ, ఆమె ముక్కు రాంములక్కాయ పిందెనూ, ఆమె కంఠం కొంగమెడనూ, ఆమె

చేతులు పడక కుర్చీ పట్టెలనూ, ఆమె నడుం సర్వీబాదును, ఆమె వక్షస్థలం ఊడుబోయిన బీడునూ-స్ఫురణకు తెస్తాయనడంలో అతిశయోక్తి ఏమాత్రం లేదు. అట్లాంటి సునందకు ఇంకా పెళ్ళి కాలేదంటే, "అయ్యో, పాపం" అన్న సానుభూతి తరంగం ఏ హృదయం నుంచైనా వెలువడటం అంత సులభం కాదు. ఆమెను పెళ్ళాడే మగవాడు మరి శాపగ్రస్తుడే అయివుండాలి!

కాని తనకంటే రోతగా, వికారంగా, అందహీనంగా వుండే స్త్రీలకు లోకంలో పెళ్ళిగావడంలేదా? తనకి మటుకు ఆ అదృష్టం ఎందుకు పట్టరాదు? ఈ ఆకారంతో ఈ భూమిమీద ఈ జన్మకు కారకుడైన భగవంతుడు అంత దారుణంగా అన్యాయం చేస్తాడా? తనకీ పెళ్ళి అయ్యేరోజు వస్తుంది. అనుకుంటూ ఆత్మ విశ్వాసాన్ని అధిక పర్చుకుంటూ వుంటుంది సునంద అప్పుడప్పుడూ. ఆ రోజు బస్సుదిగి ఇంటికివస్తూ అల్లాంటి ఆలోచనలతోనే ఉంది ఆమె.

సునందకు తండ్రిలేడు. చనిపోయి పదిహేనేళ్ళు అయింది. ఆమెకు తల్లియే పెద్దదిక్కు. మేనమామ ఫిరంగిపురం హైస్కూల్లో టీచరు. తల్లీ, ఆయనా శక్తివంచన లేకుండా ఆమెకోసం సంబంధాలు వెతుకుతూనే ఉన్నారు. అయిదారుసార్లు ఆ సంబంధాలు పెళ్ళిచూపులవరకూ వచ్చాయి. కాని ఆ తర్వాతే ఆమె అదృష్టం వక్రించి; కళ్యాణరేఖ కుంటుబడి-ఆ శుభసమయమే కనుచూపు మేరకు అందకుండా జరిగిపోతున్నది.

సునంద ఇంటికి వచ్చేసరికి వరండాలో తల్లి ఎదుట కుర్చీలో కూర్చుని మాట్లాడుతూన్న ఓ కొత్తవ్యక్తిని చూచి ఆశ్చర్యచకితయైంది. అతనికేసి ఓరకంటితో చూస్తూనే ఆమె ఇంట్లోకి మెల్లగా నడిచింది. చేతిలోని బొమ్మను అద్దాల అల్మారాలో

పెట్టి, గదిలో డ్రస్సు మార్చుకొన్నది. "అతను ఎవరో ?" అనుకుంటూండగా తల్లి వచ్చింది. ఆవిడ చెప్పింది.

"ఫిరంగిపురనుంచి వచ్చాడే ఆయన. మీ మామయ్యగారు బాగా తెలుసట. అడ్రసుయిచ్చి ఓ సారి మన ఇంటికెళ్ళి రమ్మన్నాడట. అందుచేత పోతూపోతూ మన ఇంటికొచ్చాడు. ఈ రాత్రే బస్సుకు వెళ్ళిపోతాడట. ఇక్కడ కొచ్చినపని అయిపోయిందట. ఓసారి నీతో మాట్లాడాలి అంటున్నాడు."

"నాతో ఆయన మాట్లాడేదేమిటి?" అన్నది సునంద కొంచెం విసురుగా. ఆలోచనల బడలిక ఆమె కనురెప్పలపై వాలి ఉన్నది.

"ఏమో!....అయినా ఇంటికొచ్చిన వ్యక్తిని ఆప్యాయంగా పలుకరించడం మన ధర్మం, మర్యాద. కొంచెం టీ నీళ్ళు పెట్టు" అని, ఆవిడ మళ్ళీ ఆయన దగ్గరకెళ్ళి కూర్చుంది.

పది నిముషాల తర్వాత కప్పూ, సాసర్లలో టీ తీసుకొచ్చి ఆయన కిచ్చింది సునంద.

"మా అమ్మాయి సునంద" అంటూ తల్లి పరిచయం చేసింది.

"నా పేరు రాఘవరావు" అంటూ నమస్కారం చేశాడతను. ప్రతి నమస్కారం చేస్తూ కూర్చుంది సునంద.

రాఘవరావు టీ పూర్తిగా చప్పరించే వరకూ ఎవ్వరూ మాట్లాడలేదు. ఖాళీ చేయబడ్డ కప్పూ, సాసర్ను ఇంట్లోకి తీసుకెళ్ళింది సునంద తల్లి.

"మీరు ఏ ఆఫీసులో పని చేస్తున్నారు?" అన్నాడు రాఘవరావు పరిచయాన్ని సంభాషణద్వారా పెంచుకుందామన్న తలంపుతో.

చెప్పింది సునంద.

"మీరు..." అన్నది సునంద మౌనంగా కూర్చోడం మర్యాద

కాదనే ఉద్దేశ్యంతో.

చెప్పాడు రాఘవరావు.

ఆతర్వాత వాళ్ళ సంభాషణ తాత్కాలికంగా తెగిపోయింది. కొన్ని క్షణాలపాటు ఒకళ్ళనొకళ్ళు చూసుకుంటూ కాలక్షేపం చేశారు.

రాఘవరావు వయస్సు ముప్పై సంవత్సరా లుంటాయి. ఫర్వాలేదు అనిపించే అందం. చామనఛాయ, పొడుగూ, వెడల్పులు సరిపడ్డరీతిలో ఉన్న శరీరం. గరుత్మంతుని ముక్కులాంటి ముక్కు, కాంతి అట్టే లేకపోయినా కళ్ళు పెద్దవి. కాటన్ దుస్తులే ధరించాడు. అతి సామాన్యంగా వుండడం అతని ధ్యేయం కామోసు. అత నెట్లావుంటే తనకెందుకన్న ధోరణిలో శూన్యంకేసి చూడసాగింది సునంద.

జారిన సిల్కుచీరలా ప్రవేశించింది మునిమాపు. వరండా ముందున్న కనకాంబరపు మొక్కలు చల్లగాలికి తలలు ఆడిస్తున్నాయి.

"హైదరాబాద్ రావడం నాకు యిదే ప్రథమం. మొదటిసారే ఒక చెడ్డ అనుభవానికి గురైనాను" అన్నాడు రాఘవరావు. ఆమె ఆసక్తిగా తలెత్తి చూసింది-ఏమిటది అన్నట్టు.

"సాయంత్రం సిటీబస్సు ఆబిడ్స్ సర్కిల్ వద్ద ఎక్కుతూంటే నా ప్యాంటు జేబులో పర్సు ఎవరో కొట్టివేశారు. అందులో ముప్పై అయిదు రూపాయ లున్నాయి. ఇప్పుడు ఇంటికి వెళ్ళడానికి బస్సు చార్జీలు లేవు. ఈ పట్టణంలో నన్నెరిగిన వాళ్ళెవ్వరూ లేరు. అన్యథా భావించకుండా ఓ పాతిక రూపాయలు చేబదులు యిచ్చారంటే బయటపడతాను. ఇంటికి చేరుకోగానే రేపే మీకు మని ఆర్డరు ద్వారా పంపుతాను."

సునంద చకితురాలైంది. ముక్కూ మొహం తెలియని ఓ వ్యక్తి తనని చేబదులుగా పాతిక రూపాయలు అడగడం!... కొన్ని క్షణాలపాటు ఆమె తీవ్రంగా ఆలోచించింది. డబ్బుకూ ఆమెకూ వున్నలంకె అతి గాఢమైనది. ఉద్యోగంలో చేరిన దగ్గర్నుంచీ ఇప్పటివరకూ ఆమె పదిహేను వేల రూపాయలు వెనక వేసింది. ఆ డబ్బంతా బ్యాంకులో ఉంది. అంత డబ్బును వెనక వేయ గలిగిందంటే-నిత్య జీవితావసరాల ఖర్చులో ఎంత పొదుపుగా వుంటుందో ఇట్టే ఊహించవచ్చు. వృథాగా పైసా జార విడువదు, అట్లా డబ్బును దాచుకోవడంలో ప్రధానమైన ఉద్దేశ్యమొకటి సునంద కున్నది. తన అందచందాల్ని చూసి ఏ మగవాడూ తనని వివాహం చేసికోవడానికి ముందంజ వేయక పోయినా, ఈ డబ్బు చూసైనా ఎవరో ఒకరు తనని పెళ్ళి చేసికోవడానికి ముందుకు రావచ్చునని ఆమె ఊహ. అందుచేతనే పాతిక రూపాయలు రాఘవరావుకు చేబదులుగా ఇవ్వాలంటే అంతగా ఆమె ఆలోచించాల్సి వచ్చింది. ఒకవేళ అతను తిరిగి పంపించకపోతే! తను నష్టపడవల్సిందేగా! లేదంటే పోతుందిగా!... పాపం! ఇక్కడ తెల్సిన వారు ఎవ్వరూ లేరంటున్నాడు. బస్సు చార్జీలు ఎవ్వరిస్తారు? ఎట్లా ఇంటికి చేరుకోగలడు?...ఆమెలో సహజమైన జాలీ, సానుభూతీ కలిగి-రాఘవరావుకు పాతిక రూపాయలు ఇవ్వడానికి నిర్ణయం చేశాయి.

మారు మాట్లాడకుండా ఇంట్లోకి వెళ్ళి, పర్సులోంచి పాతిక రూపాయలు తీసి రాఘవరావుకు ఇచ్చింది సునంద.

రాఘవరావు మొహం సంతోషంతో తెల్లబడింది.

"థాంక్యూ వెరీ మచ్" అన్నాడు రాఘవరావు ఆ డబ్బును అందుకుంటూ.

తర్వాత ఓ అయిదు నిముషాలకు సునంద దగ్గరా, ఆమె తల్లి దగ్గరా నమస్కార పూర్వకమైన సెలవు తీసికొని వెళ్లాడు రాఘవరావు.

రెండు రోజుల తర్వాత అతని దగ్గర్నుంచి పాతిక రూపాయల మని ఆర్డరు వచ్చింది సునందకు. 'మంచివాడే!' అనుకుని సంతృప్తి పడింది ఆమె. ఆ పైన ఆయన్ని గురించి ఆట్టే ఆలోచించ లేదు.

మూడో రోజు మామయ్య దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది.

"...రాఘవరావును నేనే మీ ఇంటికి పంపించాను-సునందను చూడటానికి. అతను మంచివాడు, రెండువందల రూపాయలు తెచ్చుకొనే ఉద్యోగి, అతనికి సునంద నచ్చింది. ఆమె కిష్టమైతే వివాహానికి అభ్యంతరం లేదని తెలియబర్చాడు. మీ అంగీకారాన్ని తెలియ బరిస్తే, అన్ని ఏర్పాట్లూ సాధ్యమైనంత వేగంగా నేనే చేస్తాను."

ఆ లేఖను ముందుగా చూసి, సునంద తల్లి అమితంగా ఆనంద పడింది.

ఆరోజు సాయంకాలం సునంద ఆఫీసునుంచి రాగానే ఆ ఉత్తరాన్ని తల్లి ఆమె చేతి కిచ్చింది.

"నీ కలలు ఇన్నాళ్ళకు ఫలించాయమ్మా! భగవంతునికి మనపై ఇప్పటికి దయ కలిగింది..." అన్నది సునంద తల్లి సంతోషంతో మెరిసే కళ్లతో.

(చుక్కాని)